


శుక్రవారం 12 జూన్ 2026 పేజీలు : 16

# గిరిజన పెంబి మండల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



# విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



# ప్రభుత్వ కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, భూ సమస్యల పరి ష్కారంలో అధికారులు ఏమా త్రం నిర్లక్ష్యం వహించినా ఉపే క్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవ ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. గురువారం కలెక్ట రేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వ హించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజా సమస్యల పరిష్కారంలో రెవె న్యూ యంత్రాంగం అత్యంత కీలకమని, బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను నిర్దేశిత గడువులోగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు.



# భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం అందరి బాధ్యత

## అటవీ ప్రాంతాల పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత

## మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి



అటవీ ప్రాంతాలను సంరక్షించి భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు-భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో మంత్రి మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని, చెన్నూర్ ప్రాంతంలోని మొసళ్ల పార్క్‌తో పాటు ఇతర ప్రకృతి వనరులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.

# విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి**

**ఏఐవైఎఫ్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లింగం రవి**



**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని , ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఏఐవైఎఫ్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లింగం రవి డిమాండ్ చేశారు .అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐబీ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, శాఖల వారీగా ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలకు బదులుగా శాశ్వత నియామకాలు చేపట్టి యువతకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉన్నత విద్యను పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటి భర్తీ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదని అన్నారు. దీనివల్ల నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతుండగా, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటోందని, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల సమస్యలు విద్యా వ్యవస్థను బలహీనపరుస్తున్నాయని, మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రజల అవసరాలను తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష నిర్వహించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేయాలని, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి మహేష్, ముత్తునూరు మహేష్, అచ్చ హరీష్, జిల్లా నాయకులు మిట్టపల్లి చందు, రోహిత్, మురారి, దేవి పోచన్న, పూజారి రామన్న తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పర్యావరణ వేత్తల సమావేశంలో ప్రతిభ చాటిన 'ప్రకృతిమిత్ర' యోగేశ్వర్





**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**తెలంగాణ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సంస్థల ప్రతినిధులతో గురువారం వరంగల్‌లోని హరిత రిసార్ట్, రుద్రమదేవి కన్వెన్షన్‌లో విస్తృత స్థాయి పర్యావరణ వేత్తల సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశానికి మంచిర్యాల జిల్లాకు చెందిన 'ప్రకృతిమిత్ర' సంస్థ వ్యవస్థాపకుడు, పర్యావరణ వేత్త గుండేటి యోగేశ్వర్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. వరంగల్ అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, విశ్రాంత డీఎఫ్‌వో కాసిపేట పురుషోత్తం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి అనుకూల జీవనశైలి అలవాట్లు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన అవగాహన కార్యక్రమాలపై జరిగిన చర్చలో యోగేశ్వర్ పలు విలువైన సూచనలు చేశారు. ఆయన ఆలపించిన "ఒక్కొక్కరు ఒక్క మొక్క" కవితా గానం సభికుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లాలో 'ప్రకృతిమిత్ర' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యావరణ కార్యక్రమాలను యోగేశ్వర్ వివరించారు. అలాగే 'ప్రకృతిమిత్ర' రూపొందించిన పర్యావరణహిత బట్ట సంచులను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 'వాల్టా' అథారిటీ సభ్యునిగా, 'ప్రకృతిమిత్ర' ద్వారా యోగేశ్వర్ అందిస్తున్న సేవలను అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మరింత విస్తృతంగా పర్యావరణ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎఫ్‌వో కాసిపేట పురుషోత్తం, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల రవి, సదాశయ ఫౌండేషన్‌కు చెందిన శ్రావణ్ కుమార్, నరేందర్ రెడ్డి, పరశురాం, లక్ష్మణ్ స్వామి, ప్రకాశ్, రాధ, సురేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాలకు చెందిన పర్యావరణ సంస్థల ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు సమావేశానికి హాజరయ్యారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశాల డ్రా 15న

**మంచిర్యాల, జూన్ 11 (ప్రజాజ్యోతి):** షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు 2026--27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్) పథకం కింద ప్రవేశాల కోసం డ్రా కార్యక్రమాన్ని ఈ నెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1వ తరగతి (నాన్-రెసిడెన్షియల్) మరియు 5వ తరగతి (రెసిడెన్షియల్) ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. 1వ తరగతిలో 91 సీట్లు ఉండగా 105 దరఖాస్తులు, 5వ తరగతిలో 92 సీట్లు ఉండగా 130 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రవేశాల ఎంపిక కోసం డ్రా కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ డ్రా కార్యక్రమం జూన్ 15వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరగనుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు తప్పనిసరిగా హాజరై డ్రా ప్రక్రియను వీక్షించాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ కోరారు.

## సాదా బైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**




**జన్నారం,జూన్11(ప్రజాజ్యోతి)**సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జన్నారం మండలంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ సాదా బైనమా దరఖాస్తుల పరిష్కరణలో భాగంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భూభారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ తదితర సేవల ద్వారా నిబంధనల ప్రకారం భూ సంబంధిత సేవలను వేగవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీ నుంచి కార్యక్రమం నిర్వహించనున్న దృష్ట్యా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఎ ఈ ఆర్ ఓ లు పనుల పురోగతిని పరిశీలించాలని తెలిపారు. ఈ క్రమంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, కార్యాలయా నికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 22 తర్వాత సమ్మె తప్పదు

## కార్మిక సంఘాలతో చర్చించి సమ్మె కార్యాచరణ ప్రకటిస్తాం

## ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**సింగరేణి కార్మికుల సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించకుంటే జూన్ 22 తర్వాత సమ్మెకు పిలుపునివ్వడం తప్ప మరో మార్గం ఉండదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు.మంచిర్యాల జిల్లా నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం మరియు రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడు సార్లు డైరెక్టర్ (పా) స్థాయిలో, రెండు సార్లు సీఎండీ స్థాయిలో సమావేశాలు జరిగినప్పటికీ ఎలాంటి సానుకూల నిర్ణయాలు వెలువడలేదని తెలిపారు. కార్మికుల్లో పెరుగుతున్న అసంతృప్తి, ఆందోళనల నేపథ్యంలో జూన్ 7, 8 తేదీల్లో కొత్తగూడెంలో జరిగిన ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సమావేశంలో సమ్మెకు వెళ్లాలని ఏకగ్రీవంగా నిర్ణయించామని పేర్కొన్నారు. ఆ నిర్ణయం మేరకు జూన్ 8న పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం 30 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును యాజమాన్యానికి అందజేసినట్లు తెలిపారు .సమ్మె నోటీసులో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిల విడుదల, నిలిచిపోయిన మెడికల్ బోర్డుల నిర్వహణ, మారుపేర్లు మరియు విజిలెన్స్ కేసుల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన డిపెండెంట్లకు ఉద్యోగాల కల్పన, సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఆదాయపన్ను భారాన్ని యాజమాన్యమే భరించడం, కొత్త గనుల ప్రారంభం, ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఆధునిక యంత్రాల ఏర్పాటు, అండర్‌గ్రౌండ్ గనులకు ఎస్‌డీఎల్ యంత్రాలు మరియు స్పేర్ పార్ట్స్ సమకూర్చడం వంటి కీలక అంశాలను పొందుపరిచినట్లు వివరించారు .అలాగే 2003 ఒప్పందం ప్రకారం బొగ్గు ఉత్పత్తిని శాశ్వత కార్మికులతోనే నిర్వహించాలని, 2025-26 ఆర్థిక సంవత్సర లాభాల్లో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని, 150/200 మస్టర్ రెగ్యులేషన్‌కు సంబంధించిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని, మైనింగ్ మరియు ఈ అండ్ ఎం క్యాడర్ సమస్యలను పరిష్కరించాలని, డిస్మిస్ అయిన కార్మికులకు ఒకసారి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె గడువు ముగిసేలోపు గుర్తింపు సంఘంతో యాజమాన్యం చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని జూన్ 22 తర్వాత సమ్మె కార్యాచరణను ప్రకటిస్తామని కొరిమి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గుర్తింపు పొందిన కార్మిక సంఘాలను పక్కనపెట్టి రాజకీయ జోక్యంతో సంస్థను నిర్వీర్యం చేసే పరిస్థితి తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశారని విమర్శించారు. కొత్త యంత్రాలు, విడిభాగాల కొనుగోలుకు నిధులు లేవని యాజమాన్యం చెబుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, సింగరేణి సంస్థను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కే బాజీ సైదా, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, ఫిట్ సెక్రటరీలు దాడి రాజయ్య, గునిగంటి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.




# బొగ్గు పెన్షన్ పెంపు, రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు కల్పించాలి

### కేంద్ర మంత్రులకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి

**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**బొగ్గు గని పెన్షన్ దారుల కనీస పెన్షన్‌ను గణనీయంగా పెంచడంతో పాటు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే, సింగరేణి డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పోట్రూలకు అసోసియేషన్ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత ధరల పెరుగుదల నేపథ్యంలో బొగ్గు గని పెన్షన్ దారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీస పెన్షన్‌ను పెంచి వారికి ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. అలాగే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సీపీఆర్ఎంఎస్ కార్డుల ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు పొందిన ఆసుపత్రుల సంఖ్యను పెంచడంతో పాటు వైద్య బిల్లుల రీయింబర్స్‌మెంట్ ప్రక్రియను సరళీకృతం చేసి, రిటైర్డ్ ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. వినతిపత్రాలు సమర్పించిన వారిలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రామచందర్ రావు, ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, ఉపాధ్యక్షుడు కంచె బీరయ్య, కోశాధికారి మేడూరి విజయ బాబు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు.



## బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**జన్నారం,జూన్11(ప్రజాజ్యోతి)**ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనకు దిగ్విజయంగా 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జన్నారం మండల బిజెపి అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో బుధవారం రోజున మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారత్ అన్ని రంగాలలో దూసుకెళ్తుందని, ప్రపంచ దేశాలే భారత్ వైపు చూసేలా ప్రధాని నరేంద్ర మోడీ పాలన కొనసాగుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మూడోసారి బిజెపిని అధికారంలోకి తీసుకువచ్చాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కూడా బిజెపి పాగా వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు బద్రి నాయక్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందవేణి పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొంతం శంకరయ్య, మండల ప్రధాన కార్యదర్శులు ఎరుకల రమేష్ గౌడ్, గాజుల దేవేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు బెదదా గోపాల్, గ్రామ ఉప సర్పంచ్ అప్పాల జలపతి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు పిట్ట రాజారావు, సంతోష్ నాయక్,శ్రీరాముల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

## విజిత్ కుమార్ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ



**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంచిర్యాల నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్ షేక్ అంకుష్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులను పరామర్శించి వారికి పండ్లు అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సమాజ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవడం విజిత్ కుమార్ ఆశయమని, ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల పట్టణ మాజీ అధ్యక్షుడు గాదె సత్యం, హాజీపూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, నాయకులు పడాల రవీందర్, షారుక్, రామగిరి శ్రీకాంత్, సల్మాన్, ఎం.డి. షకీల్, ఎం.డి. దానిష్ తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం అందరి బాధ్యత

## అటవీ ప్రాంతాల పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత

## మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి





**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**అటవీ ప్రాంతాలను సంరక్షించి భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు-భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో మంత్రి మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని, చెన్నూర్ ప్రాంతంలోని మొసళ్ల పార్క్‌తో పాటు ఇతర ప్రకృతి వనరులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి మద్దతు ధరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ,గత ఏడాదితో పోలిస్తే ఈసారి అధిక దిగుబడి వచ్చిందని, సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిర్ణీత గడువుకంటే ముందుగానే కొనుగోలు చేశామని, అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో తొలి విడతలో 3,500, రెండో విడతలో 2,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించి ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. చెన్నూర్‌లో ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధిగ్రస్తులకు స్థానికంగానే వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు . మండల కేంద్రంలో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 23 మంది వైద్యులతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి వైద్య పరికరాలు, ఫర్నిచర్ సమకూరుస్తున్నామని చెప్పారు. 10 పడకల ఐసీయూ సౌకర్యంతో ఆసుపత్రిని త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు .విద్యా రంగ బలోపేతానికి చెన్నూర్ నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నామని, దాదాపు 2 వేల మంది విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించనున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గంలో రెండు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో మైనింగ్ ప్రాంతాలు అధికంగా ఉన్నందున వాతావరణ సమతుల్యత, కాలుష్య నియంత్రణ, ప్రకృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని, పర్యాటకాభివృద్ధి కోసం జంగిల్ సఫారీలు ప్రారంభించామని, బటర్‌ఫ్లై పార్క్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు మే నెల జీతం వెంటనే చెల్లించాలి

### జూన్ 14 వరకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ

### దుంపల రంజిత్ కుమార్, సీఐటీయు జిల్లా కార్యదర్శి



**మంచిర్యాల, 11 జూన్ (ప్రజాజ్యోతి):**ఆశా వర్కర్లకు మే నెల వేతనాలను వెంటనే చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) డిమాండ్ చేసింది. గురువారం మంచిర్యాల పట్టణంలోని చార్వక హాల్‌లో సమ్మక్క అధ్యక్షతన నిర్వహించిన ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత నెల వేతనం కూడా ఇప్పటివరకు చెల్లించక పోవడం వల్ల ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వేతనాలను ప్రతి నెలా సకాలంలో చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, జిల్లా కార్యదర్శి సరోజలు మాట్లాడుతూ, ఆశా వర్కర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ, ఫిక్స్‌డ్ వేతనం సాధన కోసం జూన్ 14 వరకు జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆశా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభ, నాయకులు లీలారాణి, విజయలక్ష్మి, లక్ష్మి, శైలజ, హెలెన్ తదితరులు పాల్గొన్నారు.

## కాలు ఫ్రాక్చర్ అయిన మాజీ చైర్మన్‌కు పరామర్శ

### ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగిన కాంగ్రెస్ నేతలు



**ఆసిఫాబాద్ జూన్ 11 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల మాజీ సింగిల్ విండో చైర్మన్ మండోకర్ దాదాజీ ఈ నెల 8న ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో కాలు ఫ్రాక్చర్ అయింది. ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నూలే నారాయణ పరామర్శించారు. ఆయనతో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మండోకర్ అనిల్, మాజీ ఉప సర్పంచ్ సెల్వట్కార్ పేంటు, సీనియర్ నాయకులు గుండయ్య, మల్లయ్య ఉన్నారు. దాదాజీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## అభివృద్ధి పై ఉపముఖ్యమంత్రి భట్టి స్పెషల్ ఫోకస్



**మంచిర్యాలరూరల్ జూన్11 (ప్రజాజ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈనెల 13న మంచిర్యాల జిల్లాలో విస్తృత పర్యటన చేపట్టనున్నారు. దాదాపు ఏడాది తర్వాత జిల్లాకు వస్తున్న ఆయన పలు అభివృద్ధి, ధార్మిక, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొననుండటంతో జిల్లా రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ఆసక్తి నెలకొంది. గత ఏడాది అంబేద్కర్ జయంతి సందర్భంగా మంచిర్యాలలో పర్యటించిన ఉపముఖ్యమంత్రి అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై హామీలు ఇచ్చారు. ఇప్పుడు మరోసారి జిల్లాకు వస్తుండటంతో ఆహామీల అమలుపై కూడా చర్చ సాగుతోంది.పర్యటనలో భాగంగా ఉదయం దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం గూడెం అధికారులతో,స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నారు.మధ్యాహ్నం బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాలకు చెందిన కార్మికుల వారసులకు నియామక పత్రాలు అందజేయనున్నారు.ఈకార్యక్రమం ద్వారా అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.అనంతరం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనుల ప్రాంతాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించనున్నారు.మంచిర్యాల పట్టణంలో 6గంటలకు విశ్వనాథ ఆలయం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.ఆలయ అభివృద్ధికి సంబంధించిన పనులకు ఆయన శ్రీకారం చుట్టనుండటం విశేషంగా మారింది. ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.అభివృద్ధి కార్యక్రమాలు,ఉద్యోగాల కల్పన,ప్రజా సమస్యల పరిష్కారంపై ఈ పర్యటనలో కీలక ప్రకటనలు వెలువడే అవకాశముందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆదివాసీలను నట్టేట ముంచిన డీబీఎల్

**300 మందితో ఎన్‌హెచ్‌పై రాస్తారోకో**



**ఆసిఫాబాద్ జూన్ 11 ప్రజా జ్యోతి** దెబ్బతిన్న రోడ్డును మరమ్మతు చేయకుండా డీబీఎల్ కంపెనీ ఆదివాసీలను మోసం చేసిందని ఆరోపిస్తూ సోనాపూర్ గ్రామస్థులు గురువారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వాంకిడి మండలం గణేశాపూర్ గ్రామం వద్ద సుమారు 300 మంది గ్రామస్థులు రహదారిపై బైఠాయించడంతో ఎన్‌హెచ్-63పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. 2021లో డీబీఎల్ సంస్థ మట్టి తరలింపు కారణంగా సోనాపూర్ బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు రోడ్డు మరమ్మతు చేయలేదని, వర్షాకాలంలో బురదమయమై రాకపోకలు సాగించ లేకపోతున్నామని వాపోయారు. అంతేకాకుండా గణేశాపూర్ వద్ద బస్టాండ్, సర్వీస్ రోడ్లు, డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కంపెనీ చేతులు దులుపుకుందని మండిపడ్డారు. సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతా మని హెచ్చరించారు

## చెత్త తొలగించే చేతులకు రక్షణేదీ?

**పంచాయతీ కార్మికుల దీనగాథ**

**సీఐటీయూ నేత ఆనంద్‌రావు ఆవేదన**



**ఆసిఫాబాద్ జూన్ 11 ప్రజా జ్యోతి** గ్రామాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ తెల్లవారుజామునే విధులకు హాజరవుతున్న పంచాయతీ కార్మికుల జీవితాలు అనేక సమస్యలతో నిండి ఉన్నాయని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికెల ఆనంద్‌రావు అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్మికులు ఎండా, వానా తేడా లేకుండా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.డ్రెయినేజీల్లోకి దిగి చెత్త తొలగించడం, దుర్వాసన మధ్య పనిచేయడం, అంటువ్యాధుల ముప్పును ఎదుర్కొనడం వారి దైనందిన జీవితంలో భాగమైందన్నారు. అయినప్పటికీ వారికి అవసరమైన భద్రతా పరికరాలు, ఆరోగ్య రక్షణ సదుపాయాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సకాలంలో వేతనాలు అందకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికులకు తగిన గౌరవం, గుర్తింపు, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే కార్మికుల జీవితాలు కూడా భద్రంగా, గౌరవప్రదంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆనంద్‌రావు కోరారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల నాణ్యమైన విద్య అందించడంలో ముందు ఉన్నది

### శ్రీరాంపూర్ ఏరియా జి ఎం మునిగంటి శ్రీనివాస్

### సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రశాంతంగా ఉద్యోగుల పిల్లల ప్రత్యేక కౌన్సిలింగ్





**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల నాణ్యమైన విద్య అందించడంలో ముందంజలో ఉన్నదని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు .మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సిం గరేణి ఉద్యోగుల పిల్లల ప్రత్యేక కోటా సీట్ల భర్తీ కోసం గురువారం కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించారు. కళాశాలలో ఉన్న ఐదు బ్రాంచీల్లో మొత్తం 150 సీట్ల భర్తీకి కౌన్సిలింగ్ చేపట్టగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజర య్యారు. కౌన్సిలింగ్ సందర్భంగా 6760 ర్యాంకుతో ఓపెన్ కేటగిరీ లో మెకానికల్ ఇంజినీరింగ్ సీటు ఎంపిక చేసుకున్న నూనావత్ శివకు, 7719 ర్యాంకుతో కంప్యూటర్ సైన్స్ సీటు ఎంపిక చేసుకున్న దోర్నాల అక్షిత్‌కు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్వయంగా అలాట్‌మెంట్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల్లో సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల నాణ్యమైన విద్య అందించడంలో ముందంజలో ఉందన్నారు. ఇటీవల ఈసెట్‌లో కళాశాల విద్యార్థులు సాధించిన ఉత్తమ ర్యాంకులు దీనికి నిదర్శనమని అన్నారు. అలాగే రెండు రోజుల క్రితం ఈ కళాశాల పూర్వ విద్యార్థిని మంచాల అక్షయ వార్షిక రూ.16.43 లక్షల వేతన ప్యాకేజీతో ఎచ్ ఎస్ బి సి బ్యాంకులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకుని నాణ్యమైన పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి, అనంతరం ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కౌన్సిలింగ్‌కు హాజరైన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసి, అవసరమైన అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి నట్లు కళాశాల ప్రిన్సిపల్ కూర్మ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11, (ప్రజా జ్యోతి)**పెండింగ్ పనులు త్వరింతగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు.మావల మండల కేంద్రంలోని కేఆర్కే కాలనీలో లబ్ధిదారుల కేటాయింపుకు సిద్ధంగా ఉన్న రెండు పడక గదుల (డబుల్ బెడ్ రూమ్) ఇళ్లను జిల్లా కలె క్టర్ రాజర్షి షా గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్లకు సం బంధించిన విద్యుత్, త్రాగునీ రు, శానిటేషన్, ఇతర పెండింగ్ పనులన్నింటినీ వెంటనే త్వరితగతిన పూర్తి చేయాలని అ ధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్థానిక గాంధీ పార్క్‌ను సందర్శించి, పలు అభివృద్ధి పనులను పర్యవే క్షించారు. పార్క్‌లో నిర్మిస్తున్న 7 ఫామ్ పాండ్స్, 5 బోర్ వేల్ రీచార్జ్ స్ట్రక్చర్స్ నిర్మాణ పను లను పరిశీలించారు. వీటితో పాటు పిల్లలను ఆకట్టుకునే చిల్డ్రన్ ట్రైన్, పార్క్‌లోని ఇతర మరమ్మతు పనులను అ త్యంత వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారుల కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ జగదీ శ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజు, హౌసింగ్ పీడీ శంకర్, తహసీ ల్దార్ శ్రీనివాస్‌లతో పాటు ఇం జనీరింగ్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## నూతన జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా రవీందర్ సింగ్ బాధ్యతల స్వీకరణ

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11, (ప్రజా జ్యోతి)**నూతన జిల్లా వ్యవ సాయ శాఖ అధికారిగా బి.రవీందర్ సింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ శుభా కాంక్షలు తెలుపుతూ, వ్యవసాయ శాఖ కార్యకలాపాలను పారదర్శకతతో, సమర్థవంతంగా విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి శ్రీదర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



# భట్టి విక్రమార్క పర్యటన విజయవంతానికి ఐఎన్టీయూసీ కేంద్ర నాయకత్వం పిలుపు

**సింగరేణి కార్మిక సమస్యల పరిష్కారంపై సానుకూల ప్రకటన కోసం కృషి**

**తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ డా. బి. జనక్ ప్రసాద్**

**మంచిర్యాల, 11, జూన్ (ప్రజాజ్యోతి):**తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 13న మంచిర్యాల జిల్లా, శ్రీరాంపూర్ సింగరేణి ఏరియాలకు పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఐఎన్టీయూసీ కేంద్ర నాయకత్వం పిలుపునిచ్చింది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ల నాయకత్వంలో ఈ పిలుపు ఇచ్చారు . ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా కారుణ్య నియామకాల కింద ఎంపికైన సుమారు 400 మంది డిపెండెంట్లకు నియామక పత్రాల పంపిణీ, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు, ఇందారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల సందర్శనతో పాటు జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించనున్న నేపథ్యంలో రసూల్‌పల్లిలో సన్నాహక సమావేశంను గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్రావు అధ్యక్షతను వహించారు. అనంతరం డాక్టర్ బి. జనక్ ప్రసాద్ గారి స్వగృహంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 12 ఏరియాలకు చెందిన ఐఎన్టీయూసీ కేంద్ర నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి ఘన స్వాగతం పలికేందుకు, భారీ సంఖ్యలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కాలనీవాసులను సమీకరించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలను గతంలో పలుమార్లు ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు నిర్వహణ, సొంతింటి పథకం అమలు, గృహ నిర్మాణం కోసం రూ.25 లక్షల వడ్డీ లేని రుణం మంజూరు, మారుపేర్ల సమస్యలు, విజిలెన్స్ మరియు కోర్టు కేసుల పరిష్కారం,



అలవెన్సులపై చెల్లించిన ఆదాయపు పన్ను తిరిగి చెల్లింపులు, నూతన గనుల ఏర్పాటు తదితర 15 ప్రధాన డిమాండ్లపై ఉపముఖ్యమంత్రి నుంచి సానుకూల ప్రకటన వచ్చేలా కృషి చేస్తున్నామని అన్నారు. అలాగే మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డులో గల శ్రీ పద్మనాయక కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి సింగరేణి వ్యాప్తంగా ఉన్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, అనుబంధ కాలనీల ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అండర్‌గ్రౌండ్ గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, వివిధ విభాగాలకు చెందిన కార్మికులు, కాలనీవాసులు భారీ సంఖ్యలో బహిరంగ సభకు హాజరై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేయాలని ఐఎన్టీయూసీ కేంద్ర నాయకులకు, శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎస్. నరసింహారెడ్డి, పి. ధర్మపురి, సి. త్యాగరాజ్, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్రావు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్‌శెట్టి నరేందర్‌తో పాటు 12 ఏరియాల వైస్ ప్రెసిడెంట్లు, కేంద్ర ప్రధాన కార్యదర్శులు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు, కేంద్ర కార్యదర్శులు, వివిధ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్**



**ఆసిఫాబాద్ జూన్ 11 ప్రజా జ్యోతి :** జిల్లా కేంద్రంలోని ఏడో వార్డులో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ హామీ ఇచ్చారు. గురువారం ఏడో వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించి ఇకపై ఇలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిలువేరు వెంకన్న, మున్సిపల్ డీఈ రమాదేవి, ఏఈ నవీన్, బీఆర్ఎస్ నాయకులు సాయి శ్రావణ్, అరవింద్ పాల్గొన్నారు.

## అధికారుల సమన్వయంతో ప్రజల సమస్యలు దూరం చేయాలి

**జిల్లా కలెక్టర్ తో మోటార్ సైకిలపై గిరిజన గ్రామాలు చుట్టేసిన ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్**



**ఖానాపూర్ జూన్ 11 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గంలోని ముఖ్యంగా గిరిజన మండలాలైన పెంబి కడెం మండలాలలోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సమన్వయంతో వ్యవహరించి పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఈ మేరకు గురువారం మండుటెండల్ని సైతం లెక్కచేయకుండా జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా తో పాటు మోటార్ సైకిల్ ల పై పలువురు అధికారులతో పర్యటించి ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించేలా ఎమ్మెల్యే పర్యటన కొనసాగింది. పెంబి, కడెం మండలాలలో ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, వంతెనలు, సెల్ టవర్లు, తదితర మౌలిక సదుపాయాల కల్పన పనుల్లో అటవీ నిబంధనల కారణంగా ఆలస్యం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే పలుమార్లు సమస్యల పరిష్కారం పై అధికారులతో సమావేశాలు నిర్వహించడంతోపాటు, రెవెన్యూ శాఖ మంత్రి తో కూడా సమస్యల ప్రస్తావన జరిగిందని అన్నారు. త్వరలోనే మరోసారి మంత్రిని కలిసి, అటవీ అనుమతుల కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. అటవీ అధికారులు తమ పరిధిలో ఉన్న అంశాల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని వివరించారు. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఇస్లాంపూర్ గ్రామంలో గ్రామపంచాయితీ, అంగన్వాడి భవనాలు ప్రారంభించారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్డీఓ విజయలక్ష్మి, డిపివో శ్రీనివాస్, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు స్థానిక గ్రామాల ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన పెంబి మండల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడి**

**ఖానాపూర్ (పెంబి)మే 11(ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నియోజకవర్గం లోని పెంబి గిరిజన మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. గురువారం స్వయంగా సైకిల్ మోటార్లపై వెళ్లి ఇటిక్యాల తండా, కోలం గూడా, చాకిరేవు, గమ్మెన ఎంగ్లాపూర్, ధూందారి, చేర్యాల కడెం మండలంలోని మిద్దెచింతల, అల్లంపల్లి, ఇస్లాంపూర్, అద్దాల తిమ్మాపూర్,తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉన్న అడ్డంకులు తొలగించేలా తగు చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామాలకు కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగు పరిచేలా రెవెన్యూ భూమిలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చొరవ చూపుతామని చెప్పారు. నాణ్యమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన రోడ్డు రవాణా కల్పించేందుకు అవసరమైన చోట ఐరన్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలిగించాలని చెప్పారు. ఆయా గ్రామాలలో ప్రజలకు మెరుగైన



వైద్య సేవలు అందించాలని వివరించారు. ఏఎన్ఎం, ఆశాలు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. నిరంతరం పరిశుద్ధ్య పనులు కొనసాగించాలన్నారు. కోలం గూడాలో మొక్కలు నాటారు. అక్కడ నుంచి రోడ్డు సౌకర్యం లేని పలు గ్రామాలకు ఎమ్మెల్యే, కలెక్టర్ లు అధికారులతో కలిసి బైక్ పై పలు గ్రామాలు తిరిగారు. గమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. టవర్ ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన గ్రామ రైతు చిన్నయ్యను అభినందించారు. స్థలాన్ని వెంటనే బిఎస్ఎన్ఎల్ కు అప్పగించి, పనులు ప్రారంభం చేయించి, గ్రామస్తులకు మొబైల్ సిగ్నల్స్ సమస్యలు తీరుస్తామన్నారు. రాళ్ళవాగు పై ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

## తండాలలో రోడ్డు నెట్వర్క్, నీటి సదుపాయాలు కల్పించాలి ఎస్టి నాయకుల డిమాండ్



**సారంగాపూర్, జూన్ 11,**(ప్రజా జ్యోతి పెంబి మండల కేంద్రంలో పలు గ్రామాలు సందర్శించిన ఎస్టీ యూనియన్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రామారావు రాథోడ్, ఉప అధ్యక్షులు చవాన్ ప్రకాష్, యూత్ అధ్యక్షులు జాదవ్ ధనరాజ్,ఆయా సమస్యలపై మాట్లాడడం జరిగింది.అక్కడ ఉన్నటువంటి ముఖ్య సమస్యలు రోడ్డు, నెట్వర్క్, ఇందిరమ్మ ఇండ్లు, మిషన్ భగీరథ నీటి సరఫరా, కొన్ని తండాలలో కరెంటు సమస్య ఉందని స్థానిక తండావాసులు తెలిపారు.ఈ సమస్యలు పై అధికారుల దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రాథోడ్ రామారావు, చావన్ ప్రకాష్,దాన్ రాజ్ అన్నారు.ఆయనతోపాటు ఎస్టీ యూనియన్ శ్రీనివాస్, రాథోడ్ దత్తు, భూఖ్య శ్రీనివాస్ నాయక్ జాదవ్ మోహన్, తండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ను ఢీకొన్న లారీ ట్రాక్టర్ డ్రైవర్ మృతి





**తాండూర్: జూన్ 11** ప్రజా జ్యోతి తాండూర్ మండలం బోయపల్లి బోర్డ్ సమీపమున గల జాతీయ రహదారిపై గురువారం ఒంటి గంట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ ముస్కే రాజశేఖర్ (19)మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ కు చెందిన 19-0821, బొల్లి తిరుపతి కి చెందిన మరో ట్రాక్టర్ టా 20-1386 రెండు ట్రాక్టర్లు మంచిర్యాల ముల్కల ఆన్లైన్ ఇసుక కొరకు వెళ్తున్న క్రమములో బోయపల్లి బోర్డ్ సమీపమున గల జాతీయ రహదారిపై వెనుక వస్తున్న ఆసిఫాబాద్ వైపు నుండి మంచిర్యాల కు వెళ్తున్న 5-0777 నెంబరు గల లారీ అతివేగంగా అజాగ్రత్తగా ముస్కే రాజశేఖర్ నడుపుతున్న ట్రాక్టర్ ను వెనుక వైపు నుండి ఢీకొనడంతో ముందు ఉన్న ట్రాక్టర్ను ఢీకొని క్రింద పడటంతో ముస్కే రాజశేఖర్ తలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. అతివేగంగా అజాగ్రత్తగా లారీని నడిపి ట్రాక్టర్ ప్రమాదానికి కారణమైన, ట్రాక్టర్ డ్రైవర్ మృతికి కారణమైన లారీ డ్రైవర్ పై తాండూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పాఠశాలల్లో పారిశుద్ధ పనులు చేపట్టాలి ఎంపీ ఓ రత్నాకర్ రావు



**ఖానాపూర్ జూన్ 11** (ప్రజా జ్యోతి ) జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల లలో,పాఠశాలలో కోరినేషన్ సరిగా చేయాలనీ ఖానాపూర్ మండల పంచాయతీ అధికారి చిట్యాల రత్నాకర్ రావు మేరకు మండలంలోని కోలం గూడా బీర్ నంది రంగపేట గ్రామ పంచాయతీలలో పాఠశాల గ్రామాలతో పాటు ఇందిరమ్మ గృహ నిర్మాణాలు గ్రామపంచాయతీ రికార్డులను గురువారం స్వయంగా పరిశీలించారు పాఠశాలల పునర్ ప్రారంభానికి రెండు రోజుల ముందే మొత్తం పరిసరాలను శుభ్రం చేసి ఉంచాలని రత్నాకర్ రావు ఆదేశించారు ఇందులో పంచాయతీ కార్యదర్శులు దేవేందర్ రెడ్డి మహేష్ గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## తహసిల్దార్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు..



**సోనాల, జూన్ 11** ( ప్రజాజ్యోతి ):సోనాల మండల తహసిల్దార్ మల్లేష్ మాతృమూర్తి అంకుల్ల ఆశమ్మ నిన్న మరణించడంతో వారి కుటుంబాన్ని, కాంగ్రెస్ నాయకులు మావల గ్రామంలోని వారి నివాసంలో, పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి లోలపు పోశెట్టి, సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షులు చౌహాన్ వినోద్, చింతల్ బోరి సర్పంచ్ గైక్వాడ్ శ్రీరామ్, కాంగ్రెస్ నాయకులు భీంరావు పాటిల్ తదితరులున్నారు .

## ఖానాపూర్ సబ్ రిజిస్టర్ గా కిరణ్ తేజావత్ బాధ్యతల స్వీకరణ



**ఖానాపూర్ మే 11** (ప్రజా జ్యోతి ) నిర్మల్ జిల్లా ఖానాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్గా కిరణ్ తేజావత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు ఇక్కడ పనిచేసిన స్వామిదాస్ నిర్మల్ బదిలీ కాగా ఆయన స్థానంలో తేజావత్ విధుల్లో చేరారు త్వరితగతిన రిజిస్ట్రేషన్ కు సంబంధించిన పనులను ప్రజలకు ఇబ్బందులు కలక్కుండా పూర్తి చేయాలని సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధి ప్రాంతవాసులు కోరుతున్నారు

## వెలగనూరులో ఘనంగా 'బడిబాట' కార్యక్రమం




**దండేపల్లి, జూన్ 11**(ప్రజాజ్యోతి):మండలంలోని వెలగనూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం గ్రామంలో 'బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (హెచ్ఎం) విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తమ పాఠశాలలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వసతులు, ప్రతీ ఏటా సాధిస్తున్న ఉత్తమ ఫలితాలను ఆమె తల్లిదండ్రులకు వివరించారు."కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగుతోంది. కావున తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి." అని హెచ్ఎం విజయలక్ష్మి కోరారు.?ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రముఖులు విద్యార్థులు పాల్గొన్నా

## బిజెపి ఓబీసీ మోర్చా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులుగా సోనాల వాసి




**సోనాల, జూన్ 11** ( ప్రజాజ్యోతి ):సోనాల మండల కేంద్రానికి చెందిన గాండ్ల వెంకటరమణ భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైనారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా నియమతులైన జీవీ రమణ, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నాగేష్ ను మరియు జిల్లా పార్టీ అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ ను కలిసి శాలువాతో సత్కరించారు. వారిచ్చిన బాధ్యతకు కృతజ్ఞతలు తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవలి ఎంపీ ఓ అజిత్ ఖాన్



**సారంగా పూర్, జూన్ 11,** ప్రజా జ్యోతి ప్యారమూర్ గ్రామ పంచాయతీలోని పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల ఆవరణంలో తరగతి గదులలో పరిశుభ్రం చేపించి చెత్తను తీసివేయడం జరిగింది. ఎంపీవో అజీజ్ ఖాన్ ప్రత్యేకంగా చెత్తను చుట్టూ పరిసరాలు శుభ్రం చేయించారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ మకునూర్ వర లక్ష్మీ,పంచాయతీ సెక్రెటరీ మహేందర్ సింగ్, నాయకులు సాయన్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కూనీ చేస్తున్న బీజేపీ



**సోనాల, జూన్ 11 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మండల కన్వీనర్ గాజుల పోతన్న బిజెపి విధానాలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే రాజ్యాంగ హక్కును బీజేపీ ప్రభుత్వం కాల రాస్తుందని, అలాగే బీజేపీకి ఎలక్షన్ కమిషన్ వత్తాసు పలుకుతుందన్నారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను ఈసీ ని అడ్డుపెట్టుకుని శిఖండి రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు.మీనాక్షి నటరాజన్ పై బీజేపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ, అఫిడవిట్ పత్రాల్లో ఎలాంటి లోపాలు లేకున్నా, కేవలం రాజకీయ దురుద్దేశంతో అక్రమాలకు పాల్పడుతున్నారు అని అన్నారు. ఒక రాజ్యసభ స్థానం గెలవడం కోసం, ఇంత దిగజారుడు రాజకీయాలకు తెరతీసిన భారతీయ జనతా పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

## పెసా చట్టం అమలులో లోపా లను అధిగమించి పటిష్ట పరిచే విధివిధానాలు రూపొందించాలి

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ -ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు




**ఆదిలాబాద్ బ్యూరో,జూన్ 11, (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో పెసా చట్టం అమలులో లోపాలను అధిగమించి పటిష్టపరిచే విధివిధానాలు రూపొందించడం కోసం కార్యశాల నిర్వహించడం జరిగిందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ -ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 5 వ షెడ్యూలు ప్రాంతాలలోని 9 జిల్లాలలో అమలు అవుతున్న పెసా చట్టం పటిష్టం చెయ్యటంలో భాగంగా ఈ నెల 10, 11 తేదీలలో హైదరాబాద్‌లో పంచాయితీ రాజ్, గ్రామీ ణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించడం జరుగుతుందని, గురువారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పంచాయతీరాజ్- గ్రామీణ అభివృద్ధి శాఖ కమి షనర్ దివ్య దేవరాజన్, టి గ్రిడ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నిఖిల హాజరయ్యా రని తెలిపారు. ఈ కార్యశాల లో ఇప్పటి వరకు పెసా చట్టం అమలు లో ఉన్న లోపాలు, వాటిని పటిష్టపరిచే అంశాల పై చర్చించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో మహారాష్ట్ర తరహాపెసా చట్టం ను అమలు చేసేందుకు అవసరమైన విధివిధానాలు రూపొందించడం కోసం కార్యశాల నిర్వ హించడం జరిగిందని తెలిపారు. ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ నుండి ఈ కార్యశాలకు జైనూర్ ఎ టి డి ఓ టి. శ్రీనివాస్, జి.సి.సి. మేనేజర్ తారాచందు, బోథ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, నార్నూర్ మండల పంచాయతీ అధికారి, పర్స్వాడ పంచాయతీ కార్యదర్శి, జిల్లా పెసా సమన్వయకర్త, మొబిలైజర్స్ హాజరయ్యా రని తెలిపారు.

## సిర్పూర్ (టి)రేంజ్ ముత్యంపేట్ బీట్ లోని కంపార్ట్ 97 లో రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో ట్రాక్టర్ తో దున్నుతున్నట్టు గమనించి ఆపడానికి ప్రయత్నించిన విధులు నిర్వహిస్తూ ఉన్న అటవీశాఖ అధికారి పై దాడి



**జూన్ 11, సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) రేంజ్ పరిధిలోని కౌటాల మండలం మొత్తం పేట్ బీట్‌లోని రిజర్వ్ ఫారెస్ట్ భూమి లోని కంపార్ట్ 97 లో విధుల్లో భాగంగా గస్తీ చేస్తున్న ఫారెస్ట్ అధికారి పై దాడి, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రోజు వారి విధులలో భాగంగా బీట్ ఆఫీసర్ భూమేశ్వర్, సిర్పూర్(టి)రేంజ్ పరిధి ముత్యంపేట బీట్ లోని కంపార్ట్ 97 లో గస్తీ తిరుగుతుండగా రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో ట్రాక్టర్‌తో దున్నుతున్నట్టు గమనించి, ఆపడానికి ప్రయత్నించగా చునర్కర్ దుర్యోధన తండ్రి మొండి నివాసం కొమ్ముగూడ అను వ్యక్తి వెదురు బొంగుతో బీట్ ఆఫీసర్ భూమేశ్వర్ పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడడం జరిగింది. విషయం తెలియగా హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు తీవ్ర గాయాల పాలైన అటవీ శాఖ అధికారిని ఆస్పత్రికి తరలించారు. విధులలో అటంకం కలిగించి దాడి చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

## ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం

**నిర్మల్ జిల్లా, జూన్ 11,ప్రజా జ్యోతి** నిర్మల్ జిల్లా లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్.ఎ) యూనిట్-1, నిర్మల్ ఆఫీస్ నందు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేయుటకు ఈ ప్రకటన ద్వారా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కొరబడుతున్నాయి.ఉద్యోగ వివరాలు అట్టి ఉద్యోగమునకు అర్హతలు వివరించరు.ఆఫీస్ యొక్క పేరు1) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్.ఎ) యూనిట్-1, నిర్మల్ 2)ఆఫీస్ సబ్‌ఆర్డినేట్ (03) కావాల్సిన అర్హత 7 నుండి 10వ తరగతి మధ్య ఏదైనా పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని నిర్వాహకులు తెలిపారు.నోట్ కేవలం నిర్మల్ జిల్లా కి చెందిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం.అర్హత కలిగిన నిర్మల్ జిల్లా అభ్యర్థులు తమ సర్టిఫికెట్ జిరాక్స్ సెట్ తోపాటు ఒక ఙ్ఖుంంఙూశీ సైజ్ ఫోటోని తేదీ: 12.06.2026 ఉదయం 10 గంటల నుండి 14.06. 2026 సాయంత్రం 5 గంటల వరకు వ్యక్తిగతంగా విచ్చేసి దరఖాస్తు చేసుకోవలని అన్నారు. గమనిక ఇట్టి ఉద్యోగ ప్రకటనలో సవరణలు లేదా రద్దు పర్చుటకై ప్రెసిడెంట్, శ్రీ సాయి యూత్ అసోసియషన్ గారికి సంపూర్ణ అధికారం కలదు. మరిన్ని వివరాలకు సంప్రదించవల సిన చిరునామా: శ్రీ సాయి యూత్ అసోసియేషన్ బ్రాంచ్ ఆఫీస్ బి. అనిల్, పంజేషగల్లీ నిర్మల్, 7075750751

## ప్రజా సమస్యల్ని పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ తో మోటార్ సైకిల్ పై

అటవీ గ్రామాన్ని తిరిగేసిన ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్



**ఖానాపూర్ జూన్ 11 (ప్రజాజ్యోతి)** ప్రజా సమస్యల పరిష్కారానికి మండుటెండల్ని సైతం పక్కనపెట్టి గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తో పాటు జిల్లాలోని సంబంధిత అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలతో ముక్కు మడిగా మోటార్ సైకిల్ పై గిరిజన గ్రామాలు తండాలు గూడేలను సందర్శించిన సాహస ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ వారి స్థితిగతులు కష్టనష్టాలను పూర్తిస్థాయిలో అధికారులకు కళ్ళకు కట్టినట్లు అటవీ ప్రాంతాన్ని లెక్కచేయకుండా తిరిగి వారితో ప్రత్యక్షంగా మాట్లాడించి ప్రత్యేక చర్యతో సమస్య పరిష్కార దిశగా పరిష్కరించేందుకుఎమ్మెల్యే బొజ్జు పటేల్ పర్యటన దోహదం చేసింది పెంబి కడెం మండలాల్లోని గిరిజన గ్రామాలు తండాల గుడాల ఆదివాసి అడవి బిడ్డలు తమ సమస్యల్ని జిల్లాలోని అధికార గణాన్ని తీసుకొచ్చి ప్రత్యక్షంగా కల్పించడం పట్ల ప్రజలు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై క్షేత్రస్థాయి పరిశీలన

అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలి: కలెక్టర్ హరిత




**ఆసిఫాబాద్ జూన్ 11 ప్రజా జ్యోతి** జిల్లాలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో వేగం పెంచాలని కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. ఎల్-1 జాబితాలో ఉన్న గుడిసెల లబ్ధిదారుల ఇళ్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అర్హులను గుర్తించాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లబ్ధిదారుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. నిజంగా ఇల్లు లేని పేదలకే పథకం ఫలాలు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఇందిరమ్మ కమిటీలు, స్థానిక మహిళా సంఘాల సహకారం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను ఫైనల్ చేయాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రతి దశలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. అనర్హులు జాబితాలో చేరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి స్థలం, ఆదాయ ధ్రువీకరణ, రేషన్ కార్డు తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకే అర్హులను ఎంపిక చేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. రెండో విడతలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో, హౌసింగ్ పీడీ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## తొందరపడి విత్తనాలు వేయొద్దు

### ఏఈఓ స్రవంతి





**నేరడిగొండ, జూన్ 11 (ప్రజాజ్యోతి:** రైతులు ఎవరూ తొందరపడి పంట విత్తనాలు విత్తుకోవద్దని నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి ( ఏ ఈ ఓ) స్రవంతి సూచించారు. ఈ సంద ర్భంగా ఆమె 'ప్రజాజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ కీలక సూచనలు చేశారు. ఈ ఏడాది ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షాలు ఆలస్యంగా కురిసే అవకాశం ఉందని తెలిపారు. భూమిలో తగినంత తేమ లేకుండా విత్తనాలు విత్తితే అవి సరిగా మొలకెత్తవని పేర్కొన్నారు. విత్తనాలు మొలకెత్తకపోతే మళ్లీ మళ్లీ విత్తనాలు విత్తాల్సి వస్తుందని, దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు అనవసరంగా పెరుగుతాయని వివరించారు. కాబట్టి, రైతులందరూ భూమిలో తగినంత తేమ ఉన్నట్లు గమనించిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలని, తొందరపడి నష్టపోవద్దని ఏఈఓ స్రవంతి కోరారు.

## నేడు చలో సిసిఐ

**ఆదిలాబాద్ భవిష్యత్తును కాపాడుకుందాం**

**డిసిసి అధ్యక్షులు డా,, నరేష్ జాదవ్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11 (ప్రజా జ్యోతి)**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు ఆదిలాబాద్ జిల్లా కేంద్ర స మీపంలో ఉన్న సిసిఐ నిము ట్టడించనున్నట్లు డిసిసి అధ్య క్షుడు నరేష్ జాదవ్ తెలిపారు. చలో సిసిఐ పేరిట నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చే యాలని కోరారు. నేడు ఉద యం 9 గంటలకు భారీ నిర సన కార్యక్రమంలో మున్సిప ల్ కౌన్సిలర్ లు నాయకులు కార్యకర్తలు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని అన్నారు.ఆదిలాబాద్ జిల్లా ప్రజల హక్కులు, యువత ఉపాధి అవకాశాలు, ప్రాంత అభివృద్ధికి ప్రతీకగా నిలిచిన సిసిఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఫ్యాక్టరీని పునరుద్ధరించా లని గతకొన్ని సంవత్సరాలుగా ప్రజలు డిమాండ్ చేస్తుంటే, బిజెపి పార్టీ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యపు వైఖరిని అవలంబిస్తున్నారని, ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమ వుతోందని ఆయన పేర్కొన్నారు. సిసిఐ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించి వేలాది మందికి ఉపాధి కల్పించాల్సిన సమయంలో, ఫ్యాక్టరీకి సంబంధించిన యంత్రాలు, ఇతర ఆస్తులను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతు న్నాయనే వార్తలు ఆదిలాబా ద్ ప్రజలను తీవ్రంగా కలవర పె డుతున్నాయని అన్నారు.బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఆదిలాబాద్ ప్రయోజనాలను కాపాడటంలో పూర్తిగా విఫలమ య్యారని, సిసిఐ పరిరక్షణ విషయంలో మౌనంగా ఉండటం వెనుక కుమ్మక్కు రాజకీయాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయని ఆయన తెలిపారు. సిసిఐ ఫ్యాక్టరీని కాపాడు కోవడం అంటే ఆదిలాబాద్ భవిష్యత్తును కాపాడు కోవడమేనని, యువత ఉద్యోగాల కోసం వ లసలు పోకుండా, స్థానిక అభి వృద్ధి కోసం, జిల్లా ఆర్థిక ప్రగ తి కోసం ప్రతి ఒక్కరూ ఈ ఉ ద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. సిసిఐ నితరలించడం ఆపా లని, సిసిఐ ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించాలని, ఆదిలాబాద్ హక్కులను కాపాడా లని, ప్రజలు, యువత, కార్మికులు, రైతులు, అన్ని ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు





జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11, (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, భూ సమస్యల పరి ష్కారంలో అధికారులు ఏమా త్రం నిర్లక్ష్యం వహించినా ఉపే క్షించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవ ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. గురువారం కలెక్ట రేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వ హించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజా సమస్యల పరిష్కారంలో రెవె న్యూ యంత్రాంగం అత్యంత కీలకమని, బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను నిర్దేశిత గడువులోగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా 'భూ భారతి', సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షు ణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు.జిల్లాలో సుదీర్ఘకా లంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ-అటవీ శాఖల భూ సరిహద్దు వివాదాల పరిష్కారానికి రెండు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివాదాస్పద భూముల్లో వెంటనే జాయింట్ సర్వేలు నిర్వహించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపా లని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే కమ్యూనిటీ సర్టి ఫికెట్ల దరఖాస్తులను ఎలాంటి ఆలస్యం లేకుండా నిబంధనల మేరకు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్ఎస్ఆర్ ఎక్సెస్ సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులు, నిర్ణీత సమయంలోగా నివేదికలు సమర్పించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హె చ్చరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆర్.ఎస్. చిత్రు, డీఆర్వో స్రవంతి, ఆర్డీవో జగదీశ్వర్ రావు, ఉట్నూర్ ఆర్డీవో మోహన్ సింగ్, కలెక్టరేట్ ఏఓ వర్మ, సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, కోఆర్డినే టర్లు పాల్గొన్నారు.

# 'తుడుందెబ్బ' రాష్ట్ర కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయండి

**రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ పిలుపు**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11 (ప్రజా జ్యోతి)**ఆదివాసీల హక్కుల పరిరక్షణ, జల్-జంగిల్-జమీన్ (నీరు-అడవి-భూమి) సంరక్షణే ధ్యేయంగా పోరాడుతున్న ఆదివాసీ హక్కు ల పోరాట సమితి తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ పిలుపు నిచ్చారు. గురువారం అదిలా బాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలం కొమరం భీమ్ కాలనీలో తుడుందెబ్బ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ ఈనెల 14 (ఆదివారం) ఉదయం 11 00 గంటలకు అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేసిబి గార్డెన్‌లో తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

**ఉద్యమ నేపథ్యం - ప్రస్తుత ఆవశ్యకత**

ఆదివాసీల సంస్కృతి, సాం ప్రదాయాలపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడంలో, పోడు భూముల హక్కుల సాధనలో, ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ పటిష్ట అమలు కోసం 'తుడుం దెబ్బ' నిరంతరం రాజీలేని పో రాటాలు చేస్తోందని, నేడు ఆ దివాసీ ప్రాంతాల్లో నెలకొన్న స్థానిక సమస్యలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో ఆది వాసీ యువతకు జరుగుతు న్న అన్యాయాలపై, హక్కుల అణిచివేతపై భవిష్యత్ కా ర్యాచరణను రూపొందించు కోవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ కీలక మహాసభకు తుడుందెబ్బ జాతీయ నాయకత్వం ముఖ్యఅతిథులుగా హాజరైదిశా నిర్దేశం చేయనున్నారని ఆయన తెలిపారు. ఆదివాసీ హక్కుల సాధనకై సాగే ఈ పోరాట ప్రస్థానంలో తదుపరి వ్యూహాలు, ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ నాయకులు, అన్ని జిల్లాల అ ధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీల ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని, అనుబంధ సంఘాలైన ఆది వాసి విద్యార్థి సంఘం, ఆదివాసి మహిళా సంఘం, ఆది వాసి యువజన సంఘం, ఆదివాసి కార్మిక సంఘం,ఆదివాసి ఉద్యోగుల సంఘం, ఆదివాసి నిరుద్యోగ సంఘం తదితర సంఘాల రాష్ట్ర, జిల్లా, మం డల స్థాయి నాయకులు విధిగా హాజరై, తమ యొక్క అ మూల్యమైన సూచనలు, సలహాలు అందించి, ఈ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవం తం చేయాలని కోరారు.

# నకిలీ పత్రాలతో భూమి విక్రయం

**రూ.18 లక్షలు మోసం**

**నలుగురి పై మావల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు**

**ప్రధాన నిందితుడు ధారావత్ ప్రవీణ్ అరెస్ట్, రిమాండ్**

**మావల ఎస్ హెచ్ ఓ బి.డి. ప్రేమ్ కుమార్**




**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11, (ప్రజా జ్యోతి)** మావల పోలీస్ స్టేషన్ పరిధి లో నకిలీ పత్రాలు సృష్టించి భూమి విక్రయం పేరుతో రూ.18 లక్షలు మోసం చేసిన నలుగురు వ్యక్తులపై కేసు న మోదు చేసినట్లు మావల ఎస్ హెచ్ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. నిందితులు ధారా వత్ ప్రవీణ్ కుమార్ (36) ఏ ధారావత్ ప్రవీణ్ ధారావత్ మంగ్యా, నివాసం: మలంగి, కిషన్ నాయక్ తండా, నార్నూర్ మండలం, ఆదిలాబాద్, ప్రస్తుతం సాయినగర్, దస్నా పూర్, ఆదిలాబాద్ అనే వ్యక్తి జాతర్ల గ్రామానికి చెందిన మడావి భూమన్న (49), ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని టీఎస్‌జీఎస్‌పీ మొదటి బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు న్నాడు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు, 2022 సంవత్సరంలో ధారావత్ ప్రవీణ్ కుమార్ మా వల గ్రామంలో ఉన్న స్థలాన్ని తక్కువ ధరకే ఇప్పిస్తాననిన మ్మబలికాడు. దీంతో ఫిర్యా దుదారు తన భార్యతో కలిసి స్థలాన్ని పరిశీలించగా, ధారా వత్ ప్రవీణ్ కుమార్, ఇతర నిందితులు కలిసి ఆ స్థలాన్ని తమ సొంత ఆస్తిగా చూపించి రూ.18 లక్షలకు విక్రయించేం దుకు ఒప్పించారు. వారి మా టలను నమ్మిన ఫిర్యాదుదారు నగదు, బ్యాంకు లావాదేవీల ద్వారా మొత్తం రూ.18 లక్షలు చెల్లించాడు. అనంతరం గత 04-11-2022న సంబంధిత స్థలాన్ని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత విచారణలో నిందితులకు ఆ భూమిపై ఎలాంటి చట్టబద్ధ మైన యాజమాన్య హక్కులు లేవని, తప్పుడు, నకిలీ పత్రాలను ఉపయోగించి డోర్ నంబర్ పొందినట్లు ఫిర్యాదుదారు గుర్తించాడు. నిందితులు కుట్రపూరితంగా తప్పుడు ప త్రాలు సృష్టించి భూమిని వి క్రయించి, మోసపూరితంగా రూ.18 లక్షలు స్వాధీనం చే సుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొ న్నాడు.ఫిర్యాదు ఆధారంగా నిందితులపై క్రైమ్ నెం.379/ 2026, సెక్షన్లు 420, 406, 47 1, 34 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మావల ఎస్‌హెచ్ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసంగా లింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్ష

**ప్రతి ఇంటికీ నీటి కనెక్షన్ ఇవ్వాలని ఆదేశం**




**ఆసిఫాబాద్ జూన్ 11 ప్రజా జ్యోతి** అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటికీ నీటి కనెక్షన్ అందేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో గుర్తించిన ప్రాంతాల్లో నాణ్యతతో పనులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పిల్లలకు అందించే పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు.

# వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన వికలాంగులు**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11 (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ జిల్లాలో వికలాంగుల సమస్యలు తక్షణమే ప రిష్కరించాల ని వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్ పి ఆర్ డి), రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్, ఆర్డీ ఓలకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయా లని డిమాండ్ చేశారు. వృద్ధులకు వితంతువులకు ఇచ్చిన హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు వెళ్లి మూడో సంవత్సరంలో ఉన్నప్పటికీ అమ లు చేయడంలో వైఫల్యం చెందాయని అన్నారు. ఇప్పటికై నా వెంటనే స్పందించి వికలాంగులకు రూ 4016 రూపా యల నుండి 6016 రూపా యలు ఇవ్వాలని. వృద్ధులతో వితంతులకు. 2016 రూపాల నుండి4016. ఇవ్వాలని, మహిళా సమైక్యలకు ఇస్తున్న ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ముఖ గుర్తింపు ఇంటి వద్దనే చేయాలని, జూ న్ 2 న. తానన్న కొత్త పెన్షన్లు వెంట నే ఇవ్వాలని, రాష్ట్రవ్యా ప్తంగా 24 లక్షల 85000 మంది దరఖాస్తుల పెట్టారని, ఇందులో నుండి రెండు లక్షల మందికి ఇస్తామన్నారు కానీ ఇంత వరకు ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలలో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రజా ప్రతినిధులుగా నామినేటెడ్ పోస్టుల ఐదు శాతం వికలాంగులకు ఇ వ్వాలని, ఇళ్లు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ పి ఆర్ డి ప్రధాన కార్యదర్శి ఆరిఫా బేగం, శివ కుమార్, గణేష్, ప్రవీణ్, లక్ష్మీ, తదితరులతో పాటు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరిఫా బేగం తదిత రులు కూడా పాల్గొన్నారు.

## బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడుగా జి.వి రమణ



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11, (ప్రజా జ్యోతి)** భారతీయ జనతా పార్టీ ఓ బి సి మోర్చా జిల్లా అధ్యక్షుడు గా జి.వి రమణ ను ని యమిస్తూ పార్టీ అధిష్ఠానం ఆదేశా లు జారీ చేసింది. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ జి. నగేష్ ని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఓబిసి మోర్చా అధ్యక్షులు జి.వి రమణ ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్ల మెంట్ సభ్యులు గోడం నగేష్‌ని జిల్లా పార్టీ అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ ని కలిసి షా లువాతో సన్మానించారు. వారి చ్చిన బాధ్యతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపెల్లి గంగాధర్ రావు, సీ నియర్ నాయకులు దశరథ్ భోంస్లే తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ప్రజలకు వివరించాలి

**బజార్ హత్నూర్ మండల నాయకులు అప్రమత్తంగా పనిచేయాలి**



**బజాహత్నూర్ జూన్ 11, (ప్రజా జ్యోతి)**బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం మరియు ఎస్ఐఆర్ ప్రక్రియపై గురువారం బజార్ హత్నూర్ మండల నాయకులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమావేశం నిర్వ హించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. అన్ని మండ లాల్లో బజార్ హత్నూర్ మండలం అప్రమత్తంగా ఉండి పని చేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమం విజయ వంతం కొరకు ప్రతీ కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలన్నారు. ఎస్ఐఆర్ ద్వారా ప్రజలు నష్టపోకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో నిలిచిన ఆదర్శ ఆణిముత్యాలు



**కుంటాల జూన్ 11 (ప్రజాజ్యోతి)** ఆదర్శ పాఠశాల రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు తెచ్చిన విద్యార్థినిలు , కుంటాల పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థినిలు ర్యాంకుల మోత మోగించారు ఇటీవల విడుదలైన 2026 ఇంటర్మీడియట్ ఫలితలలో ప్రభంజనం సృష్టించారు (కే) శ్వేత. ఎంపీసీ 470/466 మార్కులతో స్టేట్ ర్యాంక్, (సౌజన్య) బైపీసి 470/436స్టేట్ ర్యాంక్ (జి)గంగోత్రి ఎంఈసి, 500/480 (జే)మనీష సిఈసి 500/485 సస్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థినిలను,తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎత్రాజ్ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## పోలీస్ కమిషనరేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో నూతన పరికరాలను ప్రారంభించిన: సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.? కమిషనరేట్ వాహనాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు గాను రూపొందించిన 'టూ పోస్ట్ హైడ్రాలిక్ లిఫ్ట్' మరియు 3 హెచ్.పి కంప్రెషర్‌తో కూడిన టైర్ చేంజర్ టూల్‌లను సీపీ పరిశీలించి,వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.?ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ?మోటార్ ట్రాన్స్‌పోర్ట్ గ్యారేజ్ నందు ఈ నూతన పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఇక్కడ పనిచేసే మెకానిక్‌లకు వాహనాల రిపేర్ పనులు సులభతరం అవుతాయి. ఈ హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా వాహనాన్ని సులభంగా పైకి లేపి, కింది భాగంలో ఉండే ఎలాంటి మరమ్మత్తులనైనా ఎంతో సురక్షితంగా, వేగంగా చేసుకునే వీలుంటుంది. అలాగే 3 హెచ్.పి కంప్రెషర్ టైర్ చేంజర్ టూల్ ద్వారా వాహనాల టైర్ల మార్పిడి ప్రక్రియ మరింత సులభం కానుందన్నారు.?సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, పోలీస్ వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్‌లో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు త్వరితగతిన అందుబాటులో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. గ్యారేజ్ నిర్వహణను, వాహనాల భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.?ఈ కార్యక్రమంలో ఆర్మడ్ రిజర్వ్ విభాగానికి ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మేడ కిరణ్ కుమార్, రజినీకాంత్, శ్రీధర్ రెడ్డి కమిషనరేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన అధికారులు, మెకానిక్‌లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ఎస్ఎల్బీసీ కాలువ పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి

**నల్గొండ :** నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఎస్ఎల్బీసీ (ాఒఃఅ) కాలువ లైనింగ్ పనులను ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువ ఆధునీకరణ ద్వారా సాగునీటి పంపిణీ మరింత సమర్థవంతంగా జరిగి, మన రైతు సోదరులకు అధిక ప్రయోజనం చేకూరుతుంది. వ్యవసాయ రంగాభివృద్ధి, నీటి వనరుల సమర్థ వినియోగమే ధ్యేయంగా మా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## సర్ కార్యక్రమంపై బి ఎల్ ఎ 2లకు ప్రత్యేక శిక్షణా సమావేశా లు డిసిసి అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 11(ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లాలోని బి ఎల్ ఎ 2 లకు సర్ కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణా సమావేశాలు నిర్వహిస్తు న్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ తెలిపారు.ఈ నెల 13వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఆదిలాబాద్ నియోజకవర్గ బిఎల్ ఎ లకు కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో అలాగే మధ్యాహ్నం 1 గంటలకు బోథ్ నియోజకవర్గ బిఎల్ ఎలకు ఇచ్చోడలోని గంగా రెడ్డి గార్డెన్‌లో శిక్షణా కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్ర మా నికి పీసీసీ ట్రైనర్ రాథోడ్ నరే ష్ ముఖ్య అతిథిగా హాజరై సర్ కార్యక్రమం, బూత్ స్థాయి నిర్వహణ, ఓటర్ల జాబితా పరిశీలన, పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై మా ర్గదర్శనం చేయనున్నారని తెలిపారు. అసెంబ్లీ ఇంచార్జులు, మండల అధ్యక్షులు, ముఖ్యనాయకులు, సంబంధిత బి ఎ ల్ ఎ లు ఈ సమావేశాల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలో పేతానికి, బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని డా. నరేష్ జాదవ్ అన్నారు.అందువల్ల సంబంధిత బిఎల్ ఎలు, నాయకులు, కార్యకర్త లు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గంజాయి క్వీన్ మళ్లీ తప్పించుకుంది...

**హైదరాబాద్ :** తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈగల్ ఫోర్స్ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నో డ్రగ్స్ ముఠాలు, గంజాయి ముఠాల ఆట కట్టించింది. ఈ క్రమంలోనే నీతూ బాయి అనే లేడీ డాన్, గంజాయి క్వీన్ మాత్రం ఎప్పటికప్పుడు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉంది. గతంలో కొన్నిసార్లు పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయిన నీతూబాయి.. తాజాగా మరోసారి ఈగల్ ఫోర్స్ పంజా నుంచి తప్పించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పక్కా సమాచారంతో దాడులు చేసిన ఈగల్ ఫోర్స్‌కు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు చిక్కగా.. నీతూబాయి పరారైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కోర్ ఐటీ ప్రాంతమైన నానక్‌రాంగూడలో గంజాయి విక్రయాలు, వినియోగాలపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రగ్ డాన్ నీతూబాయిని పట్టుకోవడమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆమె తప్పించుకుంది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న నీతూబాయి.. అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెను పట్టుకోవడం కోసం నానక్‌రాంగూడలో ఈగల్ ఫోర్స్ అణువణువూ గాలింపు చేపట్టింది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే నానక్‌రాంగూడ ప్రాంతంలో నీతూబాయి.. భారీ ఎత్తున గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది.గంజాయి కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు.. నానక్‌రాంగూడలోని నీతూబాయి ఇంటి ముందు క్యూ కట్టినట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఒక గంట వ్యవధిలోనే ఏకంగా 50 మంది ఐటీ ఉద్యోగులను పట్టుకున్నట్లు తెలిపింది.

## రోడ్డు విస్తారణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం

**హుస్నాబాద్ :** హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్లే కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు నిర్మితమవుతున్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనులను మంత్రి పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించి వాటి స్థానం లో నిర్మిస్తున్న విద్యుత్ టవర్స్ పనులను పరిశీలించి



విద్యుత్ తీగల స్తంభాల తొలగింపు పై సిబ్బంది తో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తరువాత రహదారి విస్తరణ లో భాగంగా కొండాపూర్ గ్రామ శివారుల్లో నిర్మితమవుతున్న కల్వర్టులను పరిశీలించారు. రోడ్డు విస్తరణ లో పెండింగ్ లో ఉన్న కల్వర్టులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్యాకేజీ 1,2 కింద 163.20 కోట్లు మంజూరు చేసింది .కొత్తపల్లి నుండి సందరగిరి 10 కిమీ రోడ్డు విస్తరణకు ప్యాకేజీ -1 కింద 86 కోట్లు మంజూరు చేసింది. సుదరగిరి నుండి హుస్నాబాద్ కి ప్యాకేజీ 2 కింద 77.20 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.